# లోక చరిత్ర



శ్రీ ధనికొండ హనుమంతరావు

పరీక్షలైపోయి ఎంతకూ తరగని ఎండా కాలపు సెలవలు ప్రారంభమయ్యాయి. పంజరంలోంచి తప్పించుకొన్న చిలకలాగు స్వేచ్ఛ—అంతా స్వేచ్ఛే! ఉబుసుపోక—తినటమూ, తిరగటమూతప్ప వేరే పనేమీ ఉండేది కాదు.

పేపర్లు ఎల్లా రాశానో—ప్యాసవగలనో, లేనో కూడా నాకేమీ తెలియదు; ఒక్కొక్క సమయాన మానవుడు తన శక్తిని తను కూడా తెలుసుకోలేడు కాబోలు!

ఎన్ని అడ్డంకులు వొచ్చినా—ఎంతమంది చేత తిట్లూ, దీవనలూ తింటూన్నా, ఎన్ని కష్టాలకు గురవుతున్నా—నాకు కనకమూ, కనకానికినేనుగా కాలాన్ని చంపుకుంటూ జీవిత పథంలో తప్పటడుగులు వేసుకుంటూనే వెళ్ళిపోతున్నాం.

వేచి కాచుకు కూర్చున్న పుణ్యకాలం సమీపించి పరీక్షా ఫలితాలు రానే వొచ్చాయ్. ఆ కొంత చీమల బారులో కంటికి పట్టనంత దృష్టితో నా నెంబరుకోసం వెతికాను; ఆ కంపోజిటర్‌గారు కనికరమయంతో నా నెంబర్ని తోసి పారేశారు; కనకంకూడా నన్నే అనుసరించింది. ఇటు నాన్నకూ అమ్మకూ చాలా కష్టమనిపించింది.

"ఇంకా సెకండులిస్ట్ వుందిగా—" అన్నారు నాన్న—అప్పుడుకూడా మనస్సులో [illegible] అలా. [illegible] [illegible] చూస్తూ.

నామూలాన మరి రెండు ప్రాణాలు బాధపడుతున్నాయనే విచారానికి, నా కళ్ళ ఎదుట చదివిన ఇంతమంది విద్యార్థులు ప్యాసై భుజాలెగరవేస్తున్నారే అనే ఈర్ష్యకూ, నేనూ తప్పిపోయ్యానే అన్న పరాభవాగ్నికీ—గురై—దిగులుగా రెండు రోజుల పాటు—ఆ గదినే లోకంగా చూసుకొన్నాను.

మూడోనాటికి పాతపడిపోయిన విచారాన్ని గూర్చి విచారించకుండా, నాకు నేనే ధైర్యం చెప్పుకుంటూ కనకం దగ్గరకు వెళ్ళాను.

"ఊర్లోనే వున్నావా?" అంది.

తలవొంచుకునే, వూపా.

"పరీక్ష పోయిందని దిగులా?"

"లేదు" అన్నా అంతా కమ్మేద్దామని.

"నా మూలానే పోయింది—కదూ?"

"ఎవరన్నారు—ఆ మాట?"

"మీవాళ్ళనలా?"

ఒక విధమైన రోషంతో "నువ్వు విన్నావా?" అన్నా.

"లేదు—ఊహించా."

"అర్థంలేని ఆలోచనలూ, పరిమితిలేని ఊహలూ నీ బుర్రలో ఉన్నయ్యన్న మాట!"

"కోపం వొచ్చిందా?"

[illegible] కనుబొమ్మల్ని చిట్లించి కూర్చున్నా.

కొంచెం తగ్గుస్వరంలో అంది: "నువ్వైనా ప్యాసవుతావనుకొన్నా—రాజా! నువ్వు ప్యాసవుతేనే చాల్లనుకొన్నా. ఇద్దరికీ పోయింది. నాకి పోయినందుకు నాకు విచారం లేదు. నీకుకూడా పోయిందేమా అనీ, నీ భావి జీవితాభివృద్ధికి సహాయపడే నీ చదువుకు భంగం కలిగిందేమా అనీ విచార పడుతున్నా—"

నా అభివృద్ధే తన అభివృద్ధిగా తలుస్తోందే! నా ఆత్మబంధువులు చూపే ఆదరణను చూపుతోందే! నా కష్టాల్లో కావాలని కాలుపెడుతోందే! తన వ్యక్తిత్వానికన్న నా వ్యక్తిత్వానికే అధిక ఆధిక్యతనిస్తోందే! చాలు—ఈ లోకంలో ఇల్లాటి హృదయం ఒక్కటే వుంటే చాలు—ఎన్ని కష్టాలొచ్చినా మరిచిపోవొచ్చు; అది బాధే అయినా, ఆ బాధలో కూడా సౌఖ్యం వుంది; ప్రతి మానవుడూ కోరేది ఇదేనేమో!

ఇదివరలో నేను గ్రహించలేని ఒకానొక దివ్యత్వం కనకంలో నాకు కన్పించింది. నా హృదయపూర్వకంగా ఆమెను అభినందించుకొన్నా, ఆమెకూ నాకూ యీనాడు తెగని బంధనొకటి ఏర్పడ్డదని తలిచా.

సెకండు లిస్టులో ప్యాసైనా: ఇది నాకు కొంతవరకూ ఉత్సాహాన్నిచ్చింది. కాని కనకానిది పోయింది. ఈ దిగులుతో ఆమె మనస్సు పాడౌతుందనుకొన్నా. ఆమెను కనీసం మాటల్తోనయినా ఓదార్చి కృతజ్ఞుణ్ణవవలసిన బాధ్యత వుందని బైలుదేరా.

నేనెల్లా అనుకున్నానో అంతా తారుమారైంది. నన్ను చూడంగానే ఎదురొచ్చి నవ్వుతూ అంది: "రాజూ! ఇప్పుడు అనుకుంటున్నాను—ఎగ్జామినర్లు కూడా మనుషులేననీ, వాళ్ళక్కూడా రీజనింగూ, న్యాయమూ ఉన్నాయని! నువ్వు ప్యాస

యూ్యవ్—చాలు—నా జీవితంలో ఇది చూడగలుగుతేనే చాల్ననుకున్నా—"

ఏమిటో ఈ అర్థంలేని అమాయకపు సంతోషం? నాకు ముల్లుగుచ్చుకుంటే—తనకూ్కడా బాధేనా? నా కష్టమూ, సుఖమూ, ఖేదమూ, మోదమూ—అన్నింటిల్లోనూ సగపాలును పోట్లాడి లాక్కుంటుందా? నా అంతరాత్మకు ఆత్మబంధువై సంచరిస్తూన్న—కనకం—నాకు ప్రియబాంధవి అయింది!

"నువ్వు తప్పావు—కనకం—నాకు చాలా విచారంగా వుంది—" ఇలాటి సానుభూతి వాక్యాల్ని ఏకరువు పెట్టాను.

"నాకు లేని విచారం నీకు దేనికి? నేనేం ఉద్యోగాలు చెయ్యక్కర్లేదు; ఊళ్ళేలక్కర్లేదు. స్త్రీకి విద్య ఎంత అవసరమో—అంతా నాలో వుందనే నా నమ్మకం. ముందు ముందు అభివృద్ధిలోకి రావలసినవాడివి—నాగూర్చిన విచారంతో బాధపడబోకు. ఒక స్త్రీ పురుషుడి జీవితాన్ని పాడుచేసిందనే లోకుల అభిప్రాయానికి తావు ఇవ్వొద్దు. గుడ్డివాడికి పగలైనా వొకటే—రాత్రైనా వొకటే—అంతే! నేను ప్యాసైనా వొకటే—తప్పినా వొకటే!"

౬

కాలేజీలు తెరిచే రోజులు సమీపిస్తూ వుండగానే, నాన్నా అమ్మా కలిసి నన్ను బి. ఎ. దాకా చదివించాలనే నిశ్చయాని కొచ్చారు. కాని నాకు ఇప్పటికి వున్న విజ్ఞానం చాల్ననీ, మరి ముందు చదువు వృధాయేమోననే ఉద్దేశం కళిగింది. కాలేజీ కుర్రవాళ్ళు కులాసాగా అయోమయపు ఆనందంతో జీవితాల్ని గడుపుతారనీ విన్నా. కాని, నాకు ఉన్న ఆనందమే చాల్ననీ—దురాశ నాకు లేదన్నట్టు ఆలోచించా.

"రాజు—బి. ఎ. ప్యాసై పెద్ద ఉద్యోగం చేస్తూంటే చూడాలని వుంది—" అమ్మ నాన్నతో అన్న యీమాటలు ఇంకా నా చెవుల్లోప్రతిధ్వనిస్తూనే ఉన్నాయ్.

వీళ్ళందరూ నా అభివృద్ధిని కోరే నన్ను పై చదువుకు పంపాలనుకుంటున్నారా? ఈ విధానంలో నా మాతృదేవతను సంతోషపెట్టవలసిన బాధ్యత నాదికాదా? కాని, నా ఆశయాల్నీ, నా ఆనందాన్నీ వీళ్ళకోసం బలిపెట్టనా? నా జీవితానికి నేను బాధ్యుణ్ణి కాకపోతే—వీళ్ళందరూ బాధ్యులా?

ఏమీ తోచక కనకాన్ని సలహా అడిగా.

"వెళ్లు రాజూ—నువ్వు బి. ఎ. ప్యాసవ్వాలనీ, నిన్ను చూసి అందరూ మెచ్చుకోవాలనీ నాకూ్కడా వుంది—"

చిన్నతనంనుంచీ—పుట్టి బుద్ధెరిగినప్పటి నుంచీ నేను ఎరిగిన, పెరిగిన—యీ వాతావరణాన్ని వొదిలి, ఆ నూతన వాతావరణంలోకి వెళ్ళనా? పాత స్నేహితుల్ని ఇంకా పాత చేసుకొని కొత్త మిత్రులకోసం దేకులాడనా? ప్రశాంతమైన సముద్రి మధ్యంలో ఆణి ముత్యాల ఆ స్నేహాన్ని అనాదరించి, ముందేమో పోసుకుందామని వడివడిగా పరుగెత్తు కొచ్చి—ఒడ్డునవున్న గంద్ర ఇసుకను చూసి పశ్చాత్తాపంతోవొచ్చిన ద్రోవనే త్రొక్కే సముద్రపు టలల సామెతే అవుతుందా—నా భావిజీవితం? అమ్మనూ, నాన్ననూ, కనకాన్నీ వొదిలివెళ్ళి అక్కడ మనశ్శాంతిని సంపాయించుకోగలనా? ఏమేమిటో అంతులేని తీరని సమస్యలు ఒకదాని తరువాత ఒకటిగా నాలో జేరుతున్నై.

"కనకం! నువ్వుకూడా ప్యాసైనట్టయితే నాతో వొచ్చేదానివి కదా!" అన్నా—ఏమున్నా లేకున్నా కనకం ఒక్కతే ఉంటే జీవితమే సక్రమంగా సాగిపోతుందన్నట్టు.

నవ్వి, "తప్పుతే రాకూడదా?" అంది.

మరిచిపోయ్యా: ఈ యూనివర్శిటీలో స్త్రీలు స్కూలుఫైనల్ తప్పినా ఇంటర్‌లో జేరొచ్చనే రూలొకటి ఏడ్చింది! ఇవ్వి సరిగ్గా జ్ఞాపక ముండవు!

"మరి రాకూడదా?" అన్నా ఆశతో చూస్తూ.

"నేనా? ఇంక చదవను—నాకు ఇష్టం లేదు—"

"నాకూ ఇష్టంలేదు—" అన్నా 'ఇష్టం' అనేది ప్రతి జీవికీ వుండే common అధికారమే అన్నట్టు చూస్తూ.

"నాతోనేనా నీకు లోకం? పిచ్చివాడిలా మాట్లాడుతున్నావ్—రాజూ! పోనీ నేను ఒక మాటలుకుంటాను: నామాట వింటావా—అయితే విను: వెళ్ళి చదువు. మూడు నెలల తిరక్క ముందే శెలవలు. పండగలూ, గిండగలూ....అన్నీ శెలవలే! ఇక్కడికి వొస్తూంటు కావిని. ఆ కాలేజీ ముచ్చట్లన్నీ నాకు చెప్తూంటు కావిని....నీకేం తక్కువైంది—చెప్పు—వెళ్ళిరా—"

చివరికి వొప్పుకున్నా.

ఆనాడు వెళ్ళిపొయ్యే రోజు. ఇంత వరకూ ఒకళ్ళ నొకళ్ళం వొదిలివుండని అమ్మకూ, నాకూ విచారంగానే వుంది. అమ్మ ఒకవిధమైన సంతోషంలోనే దుఃఖాన్ని అనుభవిస్తూ కళ్ళనీళ్ళు పెట్టింది.

కళ్లు రెండూ నీళ్ళతో నింపి నిలబడ్డ కనకాన్ని విడిచివెళ్ళబుద్ధిపుట్టలా. ఆమెను చూసి నా కళ్ళుకూడా తడి అయినాయ్.

తన నీళ్ళు తుడుచుకొని, నా భుజంమీద తట్టుతూ అంది: "వెళ్ళు రాజూ! ఈ పాత స్నేహితురాల్ని మరిచిపోతావా? కొత్త మిత్రుల గొడవలో నన్ను అడుగున పడేస్తావా? దూరానవున్నా మన స్నేహాన్ని తెంపవొక-ఉత్తరాలు రాస్తూంటావ్‌కాదూ! విచారం దేనికి? కొన్నాళ్ళపాటు ఇద్దరమూ దూరదూరంగా వుంటేనే కాని బాగుపడంటే అప్పుడు కాని మనలో ఒకళ్ళ కొకళ్ళకు నూతనత్వం కన్పించుదు—వెళ్ళిరా—నీ అభివృద్ధికోసం దేవుణ్ని ప్రార్థిస్తాను—నీ రాకకోసం ఎదురు తెన్నులు చూస్తూంటాను—

పోయారా—" ఓదార్పు మాటల్తో సాగనం పింది.

పెద్ద కాలేజీ కాంపౌండు—, తండోప తండాలుగా వెళ్ళే విద్యార్థులూ, పెద్ద సినిమా హాళ్ళూ, పెద్దపెద్ద పట్టణపువీధులూ నా కళ్ళకు కన్పించాయి. అక్కడేదో ఆనందం వుందని నా మనస్సు చెప్తూనే వుంది కాని, అంతకన్నా అధికమైనదాన్ని యిక్కడ పోగొట్టుకుంటున్నావ్ అని నా అంతరాత్మ చెప్తోంది. ఎల్లాగో వీడలేక వీడలేక దారి పట్టా. చచ్చేవాళ్ళు చావలేక, చావలేక మంచం చుట్టూ జేరిన తమ ఆత్మ బంధువుల్నీ వాళ్ళ విచారవదనాల్నీ చూసి, వీడలేక వీడలేక—ఇల్లాగే మృత్యు ముఖంలోకి ఎగబ్రాకుతారు కాబోలు!

## ౧౦

కాలేజీ జీవితం నా జీవిత నాటకంలోని ద్వితీయాంకానికి ప్రస్థావన అయింది. ఆ చదువువల్ల నేను బాగుపడ్డా, చెడిపోయినా—కష్టాల్నీ, దుఃఖాల్నీ కొంతవరకూ మరిచిపోగలిగి, ముందున్న అగాధజీవిత పరిమితిలోని కొంత కాలాన్ని వెళ్ళబుచ్చే సాధనంగా ఉపయోగపడ్డది.

ఈ కొత్త వాతావరణానికి అలవాటు పడటాన్ని నేర్చుకుంటూన్నా, కనకం జ్ఞాపక మొస్తూనే వుండేది. పూర్వం ఆమెతో గడిపిన ఆ మధురతమ క్షణాలూ, నేను వస్తూన్నప్పుడు ఆమె ఖిన్న వదనంతో నా ఎదుట నిలబడ్డ విషాదమూర్తీ—నాకు స్మృతికి వొచ్చి—ఈ జీవితమే వెగటనిపించేది! గడిచిన కాలాన్ని మరిచిపోవాలని శతవిధాల వ్యర్థప్రయత్నం చేసేవాణ్ని. ఇది సులభంగా సాధించగలుగుతే మానవజీవితం ఇంత కష్టభూయిష్ఠంగా ఉండదేమో! ఒక కొత్త పాఠాన్ని నేర్చుకున్నా. ఈ లోకంలో ఎంత సౌఖ్యం వుందో, అంత కష్టమూ వుంది! అన్నీ వెన్నెల రాత్రులూ కావు; అన్నీ చీకటి రాత్రులూ కావు! కనకానికీ నాకూ మధ్య కొన్నివందలమైళ్ళు అడ్డున్నా లేఖల్లోనే ఒకళ్ళతో నొకళ్ళం మాట్లాడుకునే వాళ్ళం. ఆ మాటలు మరింత కలవరపరిచేవి. స్నేహితుల్తోనూ వినోద ప్రదర్శనాల్తోనూ కాలాన్ని గడిపి, మనశ్శాంతికోసం ప్రయత్నించేవాణ్ని. ఇదంతా, కలిసి నాలో ఒక నిశ్చయానికి తావిచ్చింది: జీవితంలో ఇక ముందెప్పుడూ ఏ స్త్రీతోనూ సంబంధం పెట్టుకొని, మథన పడకూడదని.

మన అనుభవమంతా మనకు సహాయ పడుతూ, దాన్ని, క్రమమైన పద్ధతిలో ఉపయోగించుకునే శక్తి మనలో వుంటే—జీవితంలో వెనుకచేసిన తప్పుల్ని వెనక్కుతిరిగి చూసుకుంటూ, రెండోసారి అల్లాటివి చెయ్యకుండా వుండగలుగుతే— జీవితం ఇంత వెగటుగా వుండదేమో! ఏమైనా 'అనుభవం' అన్నది కొంత విజ్ఞానాన్ని కొత్త పాఠాన్ని నేర్పుతుంది.

నాలాగే హృదయ పూర్వకంగా ప్రేమించిన ప్రియురాళ్ళను వదిలి రాలేదా— ఈ విద్యార్థుల్లో కొందరన్నా? వాళ్ళు మానవులు కారా? ఇంకొకరి జీవితానికి నాది పోల్చి చూసుకొని—మనలాగే మనకు తోడుగా మరి కొందరున్నారని తెలిసికొని— ఒక విధాన ఊరటను సంపాయించాను.

కాలేజీకి దసరా శెలవలిచ్చేందుకు ఇంకో వారం ముందనగా నాకో టెలిగ్రాం వొచ్చింది. అమ్మ టైఫాయిడ్ జ్వరంతో మంచం పట్టినట్టా. నన్ను వెంటనే బైలుదేరి రమ్మని దాంట్లో వుంది. ఈ మాటలకు ఎక్కడ విలువవున్నా లేకున్నా—టెలిగ్రామ్‌లో వాటి కున్న విలువ మరేస్థానంలోనూ ఉండదు.

ఒకవిధమైన భయంతోనే ఇంటికొచ్చా. ఆతృతతో నాన్ననుచూశా; ఆయన ముఖంలో విచారం లేకపోలేదు. అమ్మను చూశాక కొంత ఆతృత తగ్గింది. నీరస స్థితిలో వున్నా—ఆమె నన్ను కావిలించుకు ఏడ్చింది. వారం రోజుల్నుంచీ జ్వరం వొస్తున్నట్టూ ఇప్పుడు జ్వరతీవ్రత తగ్గినట్టూ విన్నా. ఏమైనా ఆమె పూర్తిగా ఆరోగ్యవంతురాలైతే కాని, మళ్ళీ కాలేజీకి వెళ్ళదల్చుకోలేదు.

ఆ సాయంత్రం పాత స్నేహితురాలింటికి వెళ్ళా. ఆమె తల్లి నన్ను చూసి. "ఎప్పుడొచ్చావ్—నాయనా?" అంది. ఆ మధ్యాహ్నమే వొచ్చానని చెప్పా.

నన్ను కూర్చోబెట్టి ఆమె ఇంటివిషయాల్ని ప్రసంగించ ప్రారంభించింది. ఈ మూడునెల్లకే నేను కౌమార దశనుంచి, యవ్వన దశలోకి వొచ్చేసి, మంచి లోకజ్ఞానాన్ని సంపాయించానని ఆమె అనుకొని వుంటుంది.

"కనకానికి పెళ్ళిచెయ్యాలనుకుంటున్నా—బాబూ!" అంది,

నెత్తిన పిడుగుపడ్డట్టయింది. గుండె ఆగినట్టయింది. నాదనుకుంటూన్న కనకం పరాయి సొత్తయిపోతుందా? ఆమెకో భర్తా? వాడికో అధికారమా? మనస్సులో పరుగెడుతూన్న వివిధ భావాల్ని దాచేసి, "ఎప్పుడు?" అన్నా మామూలు ధోరణిలో.

"రేపు—వైశాఖంలో—"

వీలైనన్ని వివరాలు లాగుదామని, "ఎవరికిస్తా?" అన్నా.

"పరాయివాళ్ళ కాళ్ళుపట్టుకుంటే ఏం లాభం—నాయనా? చిన్నతనంనుంచీ అల్లారుముద్దుగా పెరిగింది. విధివశాన విధవరాలైంది. ఇప్పుడు విధవా వివాహాలు శాస్త్రసమ్మతమేనని ఒప్పుకుంటున్నారటగా! దాని జీవితాన్ని పాడుచెయ్యాలని నాకు లేదు. దానికి 'నా' అనే తుదిదాన్ని నేనేగా! నా నాల్గో తమ్ముడున్నాడు. వాడూ మొదటి భార్యను మొన్నీమధ్యనే పోగొట్టుకొన్నాడు. వాణ్నొక ఇంటివాణ్ని చేసినట్టూ అవుతుంది. నా అభిలాషా, దాని సరదాలూ కూడా తీరుతయ్...."

రెండో పెళ్ళనేప్పటికే నాకు అనుమానం వేసింది. ఈమె వయస్సునుపట్టి, ఈమె తమ్ముడి వయస్సును ఊహించుకుంటూ, "ఆయనకు ఎన్నేళ్ళుంటాయ్?" అన్నా.

"ఎబ్బే! ఎన్నోనా?'' అని, లోలోపల గుణించుకొని అంది: "ముప్పైనాలుగూ, ముప్పైఐదూ....అంతే! కరణీకం వుంది; కొంచెం సంపాయించాడు. మంచి పలుకుబడి వుంది; సంస్కారాభిలాషి...." ఇంకేమేమిటో నేను ఎరగని ఆ మహాశయుడి సుగుణపరంపరను ఏకరువు పెట్టింది. విసీ విసీ నాకు విసుగు పుడుతూన్నా, ఈ చెవుల్ని మాత్రమే ఆమె మాటలకు వొప్పగించి, ఊహాప్రపంచంలో కనకం వివాహ మహోత్సవాన్ని గూర్చి వితర్కించుకొంటున్నా.

ఉపోద్ఘాతమంతా అయ్యాక, "నీ ఉద్దేశం?" అంది.

"మంచి-దే!" అన్నా ఆమెను ఆ ప్రస్తుత సందర్భంలోనన్నా పైకి తృప్తిపరుద్దామని. నా ఉద్దేశం తన ఉద్దేశంతో ఏకమైనట్టు తెలుసుకొని, చిరునవ్వు నవ్వింది.

"కనకం——ఏదీ?"

''పైన వుంది——వెళ్ళు——"

మెల్లిగా లేచి వెళ్ళి బరువైన హృదయంతో మేడ మెట్లెక్కుతున్నా. ఒక నల్లటివాడు——బలిష్ఠంగా, మిడిగుడ్లతో, బ్రష్షుల్లాటి మీసాలు వేసుకొని దిగి వొస్తున్నాడు; ఒకళ్ళ కొకళ్ళం ఎదురైనాం,

నావైపు తీక్షణంగా చూస్తూ మోటుగా, ''ఎవరికోసం?" అన్నాడు—ఆ ఇంట్లో అంతా వీడి సొమ్మే అయినట్టు!

వీడెవడు? రాక్షసుడా? మానవుడా? నాలాగే యీ స్థలాన్ని మరగలేదు కదా. కనకం చేతిని చవిచూచే ఘట్టాన్ని ఇంకా దాటాడా? లేదా?

"కనకం కోసం" అన్నా.

"ఊ" అని దీర్ఘంతీసి ఉరిమిచూస్తూ దిగిపొయ్యాడు.

కనకం చేమంతి దండకు చివరి ముడి వేసి పళ్ళతో దారాన్ని తెంపుతోంది. మాట్లాడకుండా ద్వారందగ్గర నిలబడి ఆమెలో మార్పుల్ని కన్నార్పకుండా చూస్తున్నా.

రెండు నిమిషాలకు తలెత్తి చూసి, ఉలిక్కిపడి——ఆశ్చర్యంతో కనకం అంది: "రాజూ! ఎప్పుడొచ్చావ్? వొస్తున్నట్టు ఉత్తరంకూడా లేదే! రా....ఇంకా అక్కడే నిలబడ్డావేం? ఎన్నాళ్ళైనా కొత్తేనా? ఆ కుర్చీలో కూర్చో....అబ్బ! ఎంత మారిపొయ్యావోయ్! ఆ చేతికి మణిబంధనా? పొడుగు ఎదిగావే! ఇంకెప్పటికీ ఎదగవనుకున్నా! చిక్కిపొయ్యావ్....దిగులుపడి, నీళ్ళు పడక చిక్కిపొయ్యావ్—కదూ? ఎన్ని ఫ్యాషన్లు నేర్చావోయ్! ఎల్లాగైనా కాలేజీ స్టూడెంట్‌వి కదూ? మూతిమీద రెక్కలు విరిగిన తుమ్మెదల్ని అటొకదాన్నీ, ఇటొకదాన్నీ అంటించినట్టు—ఫ్రెంచికట్టు పెట్టించావే....!" ఇంకేమేమిటో గుక్క తిరక్కుండా వాక్ప్రవాహాన్ని వొదిలేసింది.

కనకంకూడా బాగా మారిపోయింది. ఆ కళ్ళల్లో కొంటెతనం గోచరమవటంలా. ముఖం అదో విధమైన దైన్యంతో వుంది. నాలాగే దిగులుపడి నలిగి పోయిందా?

——ఎందుకు వొచ్చానో—అదంతా. చెప్పా

"మీ అమ్మగారికి ఎల్లా వుంది?"

"ఒక మాదిరిగా వుంది——"

ఇద్దరమూ కొన్ని నిమిషాలపాటు ఒకళ్ళనొకళ్ళం చూసుకున్నాం. మా కళ్ళే మాట్లాడుకుంటాయ్; 'అల్లా అయిపొయ్యావేం?' అని ఆ చూపులే ఒకళ్ల నొకళ్ళను ప్రశ్నించి వుంటాయ్. సమాధానం లేక, రాక, ఆ శూన్య దృక్కులే ఉక్కిరి బిక్కిరయ్యాయ్.

"నాకేం తెచ్చావు——పట్నంనుంచి?" అంది—అలనాడు శ్రీకృష్ణుడు, పాత స్నేహితుడు కుచేలుణ్ని అడిగినట్టు.

నేనేదన్నా తెస్తానని ఆశపెట్టుకు కూర్చుందా? లేక నా చేతులో కాగితాల మడతలమధ్యవున్న పెట్టెను గుర్తించి అడిగిందా?

ఇచ్చా——విప్పిచూసి తనలో తను సంబరపడుతూ అంది: "మంచిటాయిలెట్ సెట్టు....ఎంతైంది?....అబ్బ! నాకోసం పది రూపాయిలెందుకు తగలేశావు?"

'అబ్బాయి డబ్బుకు అవస్థపడతాడేమో' నని ఇంటిదగ్గర్నుంచి వొచ్చే ఉల్పాడబ్బు ఇలాంటి వాటికైనా ఉపయోగపడదా? అనుకున్నా.

"ఈ కుంకం బరిణె—ముద్దొస్తోంది—"

"రేపు పెళ్ళిలో ఉపయోగపడుతుందిలే—"

'అప్పుడే నీ చెవిన కూడా పడ్డదా?' అన్నట్టు చూస్తూ, ఆ టాయిలెట్ పెట్టెను అవతలికితోసి, గట్టిగా ఊపిరిపీల్చి, "ఎవరు చెప్పారు?" అంది.

"ఎవరైతేనేంలే—"

కనకం ఇకొకళ్ళదై పోతోందేననే భయమూ, ఆ కాబొయ్యే 'మామగాడి'మీద మండిపొయ్యే, గుండె జలపీ, విచారమూ అన్నీ నన్ను ఆవరించాయి.

"నువ్వు నమ్మావా?" అంది, నా కళ్ళల్లోకి చూస్తూ.

"అబద్ధమా?"

"నువ్వు చెప్పు రాజూ! చేసుకోమంటావా?"

అనమ్మతి అయినా, తలవూపా—ఎందుకో నాకే తెలీదు.

"ఎందుకు చేసుకోవాలో చెప్పు——"

"ఎందుకేమిటి? లోకంలో అందరూ ఎందుకు చేసుకుంటున్నారు? కారణాలైతే నేను చెప్పలేను కాని...."

"నాకిష్టంలేదు——"

"అదేం? ఒకసారి ఐంది కదానువా?"

"కాదు—" అది ఒక శక్తిని లోన ప్రవేశింప జేసుకున్నట్టు గట్టిగా గాలిని పీల్చి అంది.

"ఈ పెళ్ళిళ్ళు——స్వేచ్ఛనూ, స్వాతంత్ర్యాన్నీ అరికడతాయి. చేసుకున్నదాకా వుండే ఉబలాటం చేసుకున్నాక వుండదు. ఈ పురుషుడు నా భర్త: ఈ స్త్రీనాభార్య—ఈ 'నా'తో ఒకళ్ళ ఒకళ్ళకు ఆయుధమైపోతారు. ఇదేమన్నా వస్తువా? వ్యక్తా? మెషీన్లలాగు మెకానికల్‌గా ప్రవర్తించాలి ఇద్దరూను. భర్తమీద భార్యకూ, భార్యమీద భర్తకూ తగని అనుమానం; భార్యను గదుల్లో పెట్టి తాళాలువేసి, కదల్నీకుండా, మెదల్నీకుండా అదుపూ, ఆజ్ఞా, ఆచారమూ, ఆంక్ష........ ఇంకా ఎన్నింటికో బద్ధురాల్నిచేసి వ్యక్తిత్వాన్నీ, మానవత్వాన్నీ కూడా చంపే భర్తలూ నాకు తెలుసు; ఆవకాయముక్క జాడీలో మాగినట్టు— జీవితమే మాగి మసైపోతుంది. ఇదంతా భార్యమీద చూపే ప్రేమ అని పేరుపెట్టి——అల్లి బిల్లి కబుర్లతో కళ్ళనీళ్ళు తుడుస్తారు. భార్యలంటే కామతృష్ణను తీర్చే రబ్బరుబొమ్మలకింద జమ కడతారు. వివాహం ఆడికాని పంజరాన్నీ, తైమనూ కొని తెచ్చుకోవటం, తెగని ఉరితాటిని మెడకు తగిలించుకోవటం——ఈ సమాజంలో ఈ సంఘంలో, ఈ ప్రభుత్వంలో భర్త, భార్యకు ఎంత అపకారాన్నైనా చెయ్యొచ్చు. ఇంతమంది పెద్దమనుషులూ, నీతి నియమాలు తెలిసి ఆచరణలో పెట్టమని చెప్పే పురానా మనుషులూ—అందరూ గంగిరెద్దులాగు తల లూపి, రెండు కళ్ళనూ వొప్పగించి, నోరు సగానికి తెరిచి మాట్లాడకుండా చూస్తారు. దోషి అయినా, నిర్దోషి అయినా నిర్దయగా బాధించటం బాగా తెలుసు ఈ భర్తలకు! ఏవేవో పిచ్చి భ్రమలు పెట్టి——ఈ పొలాల్ని చూడు, ఈ కోటల్ని చూడు, ఈ కార్లను చూడు, ఈ పందిరిమంచాన్ని చూడు....ఈ గౌరవాన్ని చూడు, ఈ కరెన్సీ నోట్ల బొత్తర్లను చూడు, ఈ అత్తర్లను చూడూ.... అని....వాటితోనే తృప్తి పడమని హితబోధను టానిక్కులాగు పనిచేసేట్టు చేస్తారు. ఏ విధంగానన్నా యీ లోకానికి పనికొచ్చే శక్తి ఒకవేళ ఆ స్త్రీలో వున్నా——భార్య అయ్యాక మాత్రం ఆమె ఎందుకూ, ఎవరికీ, పనికిరానిదిగా మారిపోతుంది. ఒకవేళ ఆ స్వాతంత్ర్యంకోసం పోట్లాడబోతే 'నేను నీకు అన్నం పెడుతున్నాను; గుడ్డ యిస్తున్నాను; విశ్వాస విహీనురాలిగా ప్రవర్తిస్తావేం?' అని గదమాయిస్తారు; ఉంపుడుకత్తెకూ భార్యక్కూ ఇంకేమిటి తేడా? ఈ సమాజంలో 'భార్య' కన్న 'వేశ్య' అవటం మంచిది. ఆ వేశ్యకైనా ఇష్టా ఇష్టాల్లోనూ, స్వేచ్ఛతోనూ కొంతవరకూ బాంధవ్యం ఉంటుంది. భార్య ఐతే కోరలు పెరికిన పామై- ఆత్మ గౌరవాన్ని ఆహుతి ఇవ్వాలి. ఎక్కడ ఏ పురుషుడి కంట పడుతుందోనని కాపలాలూ, ఇంట్లో ముసలమ్మల ప్రబోధాలు; పాతివ్రత్య మహత్యాలు, భక్తి పారవశ్యాలు, భజనలు....అబ్బో! చుట్టూ ముళ్ళ కంపలే, తాము సంతుష్టి పడ్డట్టూ, కాపరం బట్టబయలు కాకుండా పరువూ మర్యాదా నిలుపుకోవాలనీ, తమ లోపాల్నీ, తమ కష్ట నష్టాల్నీ నలుగుర్లో చెప్పుకోవటం సిగ్గనీ, ఒకవేళ చెప్పుకున్నా అవ్వి తీరక పోను తమను చూసి నలుగురూ నవ్వుతారనీ——పైకి మాత్రం తాము మహా అదృష్టవంతులైన ఇల్లాళ్ళలాగు మేకపోతు గాంభీర్యాన్ని ప్రకటించే యీ భార్యలు—వీళ్ళ సంగతి చాలా మందికి తెలిసినా ఎవ్వరూ పైకి అనరు. విధిలేక భర్తల దగ్గర పడివుండే యీ భార్యలకు ఇప్పుడు ప్రభుత్వంవారు పరిష్కారమిస్తే దాంట్లోకైనా వెళ్ళలేని అసహాయత ఇన్నాళ్ళ సంసారాల విచ్ఛిన్నమైపోవూ? అంతా అశాంతి ప్రబలిపోదూ..." ఎక్కడ చదివింది ఇంత ఉపన్యాసాన్ని!

"అయితే అందరూ భర్తల దగ్గర ఇల్లాగే ఉన్నారంటావా?"

"ఉండక ఏం చేస్తారు? వాళ్ళగోల ఎవరు వింటారు? అంతా కంఠ శోష—అరణ్య రోదనం! లేని ధైర్యాన్ని తెచ్చుకొని భర్త పాదాల కింద పడి నలగటాన్ని భరించలేని భార్య బైటపడితే—అటు పుట్టింటికీ, ఇటు అత్తారింటికీ కూడా నీళ్ళధారేగా! ఏమౌతుంది,అప్పుడామె గతి?—"

"ఇష్టం లేకుండానే వీళ్ళందరూ కాపరాల్ని చేస్తున్నా రంటావా?"

"నువ్వు చూడటంలా? నేను ఎరిగినంతవరకూ, విన్నంతవరకూ, కన్నంతవరకూ నా దృష్టికి ఇల్లాటివాళ్ళే తగులుతున్నారు...."

"వివాహ వేదికకూ, కర్మకూ——పవిత్రతా, విలువా లేదనే అంటావా?"

"ఈ మంత్రాలకు మామిడికాయలు రాల్తాయా? ఇంకా ఇక్ష్వాకులనాటి బూజు పట్టిన నమ్మకాలమీదనే వుందీ నీ లక్ష్యం? నిజంగా ఆ మంత్రాలకు ఇంత విలువే వుంటే ఇన్ని సంసారాలు యిల్లా ఎందుకు తారుమారవుతున్నాయ్? శుభలగ్నంలో చేసే ఇన్ని వివాహాలూ ఇల్లా ఎందుకు ఏడుస్తున్నాయ్? ఇంతమంది వితంతువులెందుకు తయారౌతున్నారు. 'అంతా విధి!' అంటారు——లగ్నం పెట్టేటప్పుడు లెక్కకురాని విధి భర్త చచ్చేప్పటికి సమయానుకూలంగా ఠక్కున తయారౌతాడు! మనం ఆ కర్మకాండకు కొంత విలువను ఏర్పరుచుకున్నాం, ఆ విలువకు ఈ దంపతుల్ని ఒక గిరిలో, అదుపులో, ఆజ్ఞలో నిలబెట్టవొచ్చనే ఉద్దేశంతో! ఈ మంత్రాలూ, నోములూ ప్రేమను తెచ్చిపెడతయ్యా? ఈ పెళ్ళిళ్ళకూ, వ్యభిచారాలకూ ఒక్కటే భేదం! వ్యభిచారాన్ని

ప్రభుత్వమూ, సంఘమూ—ఎవ్వరూ ఒప్పుకోరు. కాని కాపరం అంటే అందరి అనుమతిమీదా సాగించే లీగల్ వ్యభిచారం—లైసెన్స్ పొందిన పైకిల్ రోడ్డుమీద తిరిగినట్టే! ఎంత గొప్ప సంబంధమన్నా తెగుతుంది కాని—ఈ దాంపత్యపు శృంఖలాలు ఏలోహంతో చెయ్యబడ్డవో కాని, అవ్వి మాత్రం తెగవు! భూకంపం వొస్తున్నా 'నా భార్య' 'నాభర్తే!' ఇదీ మన వివాహపు తంతు!"

ఇదేమిటా ఇల్లా పిచ్చిగా మాట్లాడుతుందని చూస్తున్నా, ఆమెతో పోట్లాడటం మంచిది కాదనుకున్నా. వివిధ వ్యక్తులకు వివిధ రుచులు, భిన్న ఆశయాలూ వుండటం ఈనాటికి కూడా కొత్తకాదుగా!

"పోనీ మీమామంటే నీకు ఇష్టంలేదా?"

"నువ్వు చూడలా ఆయన్ని? ఇందాక నీకు ఎదురయ్యే వుంటాడు........"ఆఁ. ఆ నల్లవాడే! ఆయన మంచివాడు; సరదామనిషి. నేనంటే పడిఛస్తాడు. నాకూ వాడికీ ఈడేమిటి? అసలు నాకు వివాహమంటేనే తలనొప్పి—నాకు రెట్టింపు వయస్సువేసుకొని ఇంకా పెళ్ళట. పెటాకులు!"

"సంఘ సంస్కర్తటగా!" కనకం తల్లి ఆ మామగాడికి తగిలించిన కాంప్లిమెంటును ఇక్కడ విసిరి చూద్దామనుకొన్నా.

"పెళ్ళిచేసుకునేదాకా అల్లానే అంటారు. ఆ ఉచ్చులో పిట్ట పడ్డాకకాని దాని పని పట్టరు. పెద్ద ఉపన్యాసాలిస్తారు. తమ ఇంట్లో ఆడవాళ్ళకు తప్ప ఈలోకంలో వున్న ఇతరస్త్రీలకందరికీ స్వాతంత్ర్యం సంపాయించి పెట్టటానికి నడుములు బిగిస్తారు. వాళ్ళల్లోనే లేని 'సంస్కారం' ఇతర్లలోకి ఎక్కించాలంటారు ఇవ్వేమో కలరా ఇంజక్షన్లూ, మలేరియా ఇంజక్షన్లూ, అని తలుస్తూ. మాటల్లో, పాటల్లో, రాతల్లో, కోతల్లో ఉట్టిపడే సంస్కారం— వ్యక్తిగతంగా శూన్యం—ఆయన ఏమైతే నాకేంలే—"

"ఐతే ఎవర్నీ పెళ్ళాడవా?"

"ఈ జీవితానికి లేదు—" జోతిష్కులు కూడా పప్పులో కాలేసే 'భావి' ని గూర్చి ఒక్కసారే చెప్పగలిగిందేమా అనుకున్నా.

"నువ్వో—" అంది.

"ఏమో—చేసుకోమంటావా?"

"నీ ఇష్టం—నువ్వు నేనైతే చేసుకోబోక—" అంది నవ్వుతూ.

రెండునిమిషాల పాటు గదిలో నిశ్శబ్దత తాండవించింది.

"మీ అమ్మకు చేద్దామని వుందట. అసలు ఆవిడగారు అవసరంకొద్దీ ఇల్లా సంఘ సంస్కర్తగా మారి నిన్ను చదివించిందేమో ననుకుంటా—" మా స్నేహ బలం చేతనే ధైర్యంచేసి గడుసు కనకం దగ్గర ఇంతమాట అనగలిగాననుకుంటా.

"ఛా....ఆమె ఉద్దేశం నాకు తెలీదు కాని....నేనే చదువుకుంటానంటే సరే నంది. నువ్వు చెప్పిన రకమూ ఉన్నారులే! అవసరం కొద్దీ మామ ఇప్పుడు సంఘ సంస్కర్త వేషాలు వేసి—ఏమేమిటో చెప్పటంలా?"

"ఇంకా లెంపకాయ పడలా?"

నవ్వి అంది: "వీకు తగిలిందని—అందరికీనా? అసలు ఆమాత్రపు గడుసుతననున్నా చూపకపోతే స్త్రీ జీవితం కష్టంలే!"

అయితే నేను అవసరం కొద్దీ తిన్న దెబ్బా అనుకొన్నా.

బంగారు రంగుతో నీరెండ ఆమె ముఖాన్ని ముద్దాడుతోంది.

"రాత్రికి ఇంటిదగ్గరే పడుకో—ఇక్కడకు రావోక—మామకు అనుమానం—"

అమ్మ దగ్గరుండాలి; ఎల్లాగూ రాను కాని, ఈమామ—వీడెవడు—పానకంలో పుడకలాగు? ఆ పిచ్చి గబ్బిళాయిగాడిమీద ఉన్నవి కొన్నీ లేనివికొన్నీ కలిపి వాణ్నొక ఊహాపాత్రగా నా జలసీ అంతా [illegible] కనకానికి నవరస భరితంగా చెప్పా.

"నవ్వి, "అప్పుడే [illegible] జలసీ పుట్టిందీ? ఏం? వాడూ వుంటాడు—లోకంలో ఎంతమంది లేరు?" అంది.

నా ప్రయత్నం భగ్నమైందని, 'పోనీలే' అని మళ్ళీ అనుకొని, "సరే—వెళ్తా"నంటూ లేచి నిలబడ్డా.

"ఈ చెండు తల్లోపెట్టు" అంది వెనక్కు తిరిగి వేణీభరాన్ని, చెండునూ నాకు వొప్పచెప్తూ.

మృదువైన ఆమె కుంతలాల్ని సరిగా సర్ది ఆ చెండును తల్లో పెట్టా.

"వెళ్ళనా?" అన్నా రెండడుగులు ముందుకు నిడిచి.

"మళ్ళీ దర్శనం?" అంది ప్రశ్నార్థకంగా నావైపు చూస్తూ.

"వీలైనప్పుడు—" నవ్వింది.

బరువైన గుండెతో, ఆ చిరు చీకట్లను చీల్చుకుంటూ, మెల్లిగా పాదాల్ని ఎత్తి ఎత్తి వేస్తూ బైటపడ్డా.

౧౧

అమ్మ శవాన్ని దహనంచేసి వొచ్చిగదిలో కూర్చొని విషాదాలోచనలో పడ్డాను. మాతృమూర్తి కౌగిట్లో పొందే ఆనందం ఈనాటి నుంచీ మరిచిపోవాలి కాబోలు! నా కష్టాంకు హృదయ పూర్వకంగా సానుభూతి చూపి కన్నీటిని కార్చే ఆత్మబంధువొకతె యీలోకం నుంచి విరమించింది. లోకచరిత్రలో మృత్యువుల సంఖ్యకు మరొకటి కలిసింది.

ఇన్ని రోజులూ కళకళ మంటూన్న ఇల్లు ఈనాడు స్మశానవాటికలాగు—ఇసుకపర్రలాగు తయారైంది. లోకమంతా చీకటి అవరించినట్టూ. ఆ అంధకారంలో దారి తెలీక తికమక పడుతూన్నట్టుగా భావించాను. అతి గారాబంగా పెంచినతల్లి— నా జీవితపు 'తీరని కోరిక' అంటూ లేకుండా

వుండేందుకు స్వార్థాన్ని కూడా త్యాగం చేసిన అమ్మను పోగొట్టుకొన్న నా జీవితంలో ఇక ముందున్నవన్నీ కాళరాత్రులుగానే కన్పించబోతాయి. అన్నం తినక, కోపం వొచ్చి బిగతీసుకుపడుకున్నసమయాల్లో—సాగతీసి బతిమాలి, భంగపడి తన చేత్తో అన్నం కలిపి నానోటికందించిన ఘట్టాలూ, శాశ్వత నిద్రలో నిమగ్నమయ్యేముందు, "నాన్నను కనిపెట్టి వుండు నాయనా! నేనూ నాన్నా కలిసి నాన్నే అనుకో! పెద్దవాడి వయ్యావు. నీకు నాన్నా, నాన్నకు నువ్వుగా ఉండటం నీవిధి అని తెలుసుకో—ఆయన కూడా పెద్దవారయ్యారు; నీమూలాన ఆయనకు మనశ్శాంతి లభించాలి సుమా! త్వరగా పెళ్ళిచేసుకో బాబూ! నువ్వూ, కోడలూ కాపరం చేస్తూంటే చూసి ఆనందించలేని భాగ్యం యీ కళ్ళకు లేకపోయినా—నాన్నకన్నా ఆ భాగ్యాన్ని కలగనీ. ఇది నాతుది సందేశంగానూ, నీవిధిగానూ తలుచు; అప్పుడే నా ఆత్మకుశాంతి...."... అని చెప్పిన అంత్య వాక్యాలూ జ్ఞాపకమొస్తున్నాయ్. దెబ్బ తగిలినప్పుడు 'అమ్మా' అని కేకేస్తే, బాధలో అరుస్తే ఈ ఇంట్లో ఇంకెవరు పలుకుతారు?

నిన్నా, మొన్నా, ఈనాటిదాకా కూడా ఇంట్లోనే మంచాన వాలి చిక్కిన శరీరంలో నుంచి, గట్టిగా ఊపిరి పీలుస్తూ, నన్ను నిమిరిన అమ్మ అమాంతంగా మాయమైంది. ఇంకా ఇంట్లో ఎక్కడో ఉన్నట్టుగానే భావించి, భ్రమించి ఇల్లంతా గాలించా. ఆమె నగలూ, ఆమె కొన్న పాత్రసామానులూ, చీరెలూ, ఆమె పెట్టె—అన్నీ యజమానురాల్ని కోల్పోయి ఏడుస్తూ మూలమూలల నక్కికూర్చున్నాయ్. ఆమెకు సంబంధించిన ఎంత చిన్నవస్తువైనా ఈనాటి నుంచీ ఆమెను జ్ఞాపకం తెస్తూనే వుంటుంది. ఏ కంఠంలో నాకు మాధుర్యమూ, మృదుత్వమూ, మార్దవమూ స్ఫురించేవో, ఏకమనీయమైన గాజుల చప్పుడులో నాకు గంధర్వగానాలు వినిపించేవో—అవ్వి ఇక ముందుండవు కాబోలు! క్రమేపీ ఆమెనూ, ఆమె ఈలోకంలో గడిపిన జీవిత విశేషాల్నీ కూడా నేనూ, ఆమెకు ఆప్తులైన మరి కొందరూ మరిచిపోతారు కాబోలు!

ఆమె తీయించుకొన్న పెద్ద ఫొటో మాత్రం హాల్లో వుంది. ఆమె స్వరూపాన్ని—ఛాయా రూపంలో ఆ యంత్రసహాయంతో—మన కళ్ళకింకా కన్పించేట్టు చెయ్యగలిగిన శాస్త్రజ్ఞుడూ, చిత్రకారుడూ—ఆమెకు ప్రాణాన్ని మాత్రం పొయ్యలేరుగా!

నా హృదయంలో ఎక్కడో, ఏ మారుమూలో దూరాన చిన్న ఆశాజ్యోతి క్షీణకాంతుల్తో మెరుస్తోంది. అది అయింది; "అమ్మ మళ్లా వస్తుందేమో!" తిరిగి వొస్తుందా? ఎందుకువొస్తుంది? ఎక్కడైనా,ఎప్పుడైనా? ఎందుకైనా చచ్చినవాళ్లు మళ్ళీ తిరిగి వొస్తారా అది అసంభవమంటుంది కామన్ సెన్స్.

మరి మాట్లాడకుండా ఆ చిన్న ఆశాజ్యోతిని గట్టిగా ఊది ఆర్పేశాను.

నన్ను కడుపులో పెట్టుకు కాపాడి, ఏ చేతుల్తో ఎత్తుకు తిప్పి పెంచి పెద్దచేసిందో కాని—కృతఘ్నుడనై యీ చేతుల్తోనే ఆమె మృతదేహానికి నిప్పంటించానే! కాలచక్ర గమనంలో అందరూ తుదకు నడిచే తోవనే ఆమెకూడా నడిచిపోయింది. మృత్యువులో ఎంత పరిణామం వుంది! తలుచుకుంటే ఆమెకూ నాకూ అంతులేని అనంత సముద్రాలు మొలుస్తున్నాయ్. ఆమె అదృష్టవంతురాలు! ఆమె మృతికి విలపించే మేమే దురదృష్టవంతులం! ఈ విశాలవిశ్వంలో రోజుకు, నిమిషానికి, క్షణానికి ఎంతమంది పోవటంలేదు! ఎంతమంది రావటం లేదు! అందులో ఆమె ఈనాటికి ఒకతె అయింది! ఆ ఒక్క ప్రాణీ విరమిస్తే—దానికి సంబంధించిన మరి కొన్ని ప్రాణులు కొంతకాలం బాధపడతాయ్. మానవుడు, మానవుడికి సానుభూతి చూపాలని, ఆవేశకు ఓదార్చి చూపే lip sympathy తోనే తృప్తి పడాలి. ఏదేదో పిచ్చి వేదాంతాన్ని ఆలోచించుకుంటూ, అడుగంటిన ఆశలతో శూన్య హృదయంలోనుంచే ప్రవహించే కన్నీటితో తలగడా తడుపుకుంటూ—ఎక్కడో వున్న అనంతమైన చీకటి మహా సముద్రాల్లోకి—ప్రపంచంలో—నడిచి వెళ్ళాను,

## ౧౨

గాజుల చప్పుడు విని కళ్ళు తెరిచా. ఎక్కడున్నాను? నా ఫాలభాగాన్ని తాకుతున్న మృదు హస్తం ఎవరిది? అమ్మ మళ్ళీ తిరిగి వొచ్చిందా? గుర్తించా—కనకం! ఇక్కడికి, మా ఇంటికి ఎందుకు వొచ్చింది? ఏమిటీ బాధ? ఇంత నీరసంగా లేవలేని స్థితిలో—మంచంలో ఎందుకున్నాను? కనకం కళ్ళు చెమ్మగిల్లా యెందుకు?

నీరస స్వరంతోనే అన్నాను: "కనకం! ఇల్లా వొచ్చావ్ దేనికి?"

ఆమె కళ్ళు తుడుచుకొని, "చెప్తాలే—ముందు మందు తాగు" అంది. ఔన్స్ గ్లాస్‌లోని ఎర్రని మందును, నా నోటి దగ్గర పెడుతూ.

ఆమె కళ్ళల్లోకి చూస్తూ, "మంచెంకుదు?" అన్నా.

ఆమె కళ్ళల్లో నన్ను ఆజ్ఞాపించే శక్తి వుందేమో! కిక్కురుమనకుండా మందు ఒక్క గుటక తాగా.

"ఛీ....ఛీ—వెధవ చేదు మందులు–"

"నాకోసం తాగవూ? నామాట వినవూ?" అంది దీనంగా చూస్తూ, ఫాలభాగంమీది వెంట్రుకల్ని పైకి తోస్తూ.

కళ్ళు రెండు గట్టిగా మూసుకొని ఎల్లాగో గొంతులోంచి మందు వెళ్ళే సందిచ్చాను.

"చేదు....చేదు...."

"ఈ లవంగం వేసుకో–"

నోరు కొంచెం బాగుపడ్డది.

ఏమేమి సంగతులో జ్ఞాపకమొస్తున్నయ్. తల గిర్రు గిర్రున తిరిగిపోతూన్నది. కనకం నా పక్కన ఉన్నట్టు తెలుస్తూనే వుంది. నా శరీరం నాకే వేడిగా, ఆ భారాన్ని మోసే శక్తినికూడా కోల్పోయినట్టు నీరసంగా వుంది. అందకుండా పరుగెత్తుకు పోతూన్న Presence of mind ను బలవంతాన చిక్కబట్టుకుంటూ—అర్ధంలేని శూన్య దృక్కుల్తో కనకాన్ని చూడసాగాను.

''ఆకలవుతోందా?"

తలవూపా.

ఫ్లాస్కులో కాఫీని గాజుగ్లాసులో తెచ్చి. మెల్లిగా నన్ను పట్టుకు కూర్చోపెట్టి తాగించింది. నరనరాల్లోకీ ప్రవహించిన ఆ వేడి కాఫీ నాలో ఇంకా ఎక్కడో మిగిలి ఒదిగి కూర్చున్న శక్తిని మేల్కొల్పింది.

"కనకం! అన్నమయిందేమో కనుక్కొస్తావూ?"

ఆమె పమిట చాటున నవ్వి: "పిచ్చి రాజూ! అన్నమేమిటి? నీకు జ్వరమని—నీకు తెలీదూ?" అంది.

"ఎన్నాళ్ళనుంచీ? ఏం జ్వరం?" అన్నా. ఈ పెద్ద నిద్దురలో నాకు అంతా ఏదో కలలాగు, తెరపైని చూచే సినిమా బొమ్మల్లాగు వుంది.

మూడువేళ్ళను ముడిచి చూపింది. నాకు తెలీకుండా—సూర్యుడు నన్ను రెండుసార్లు చూచి వెళ్లాడా? రెండుసార్లు భూమి తన చుట్టూతను నాకు తెలీకుండానే పరిభ్రమించిందా? రెండు దినాల్లోనూ ఏం జరిగింది? బాగా గుర్తు లేదు.

"నువ్వు మతిలేకుండానే పడివున్నావ్—" అంది 'ఉహూ.' అనుకొన్నా.

"అమ్మ చచ్చిపోయింది; ఈలోకంలోని బాధలకు నేను కూడా చచ్చి బతికాను—"

"పోనీ—నాన్న చచ్చిపోతే నేనెల్లా వున్నాను? మానవుడికి పుట్టుక ఎంత అవసరమో, చావుకూడా అంత అవసరమే! తల్లిలేని వాళ్ళు లోకంలో ఎంతమంది లేరు? అందులో నువ్వొకడి వౌతావ్—మాటమాటకూ ఆ విషయాన్ని జ్ఞాపకం చేసుకొని బాధపడతావ్ దేనికి?"

"నేను కూడా పోతే బాగుండును నేనెందుకింకా ఈలోకంలో?" అన్నా అదో విరక్తి నన్నా క్షణంలో పూర్తిగా ఆవరించి లొంగదీసుకొని వుంటుంది.

పమిటతో విసురుతూ కళ్ళుపెద్దవిచేసి అంది: "నాక్కావాలి. తెలిసిందా? నాకోసం నువ్వూ, నీకోసం నేనూ బతికివుందాం. ఏం?"

గడ్డం పట్టుకొని బతిమాలినట్టు నావైపు దీనంగా చూసింది.

"నాన్న ఏడీ?"

"బైట ఎవరితోనో మాట్లాడుతున్నారు."

"ఇక్కడికెల్లా వొచ్చావ్?"

"నాకు కాళ్ళులేవూ?" అంది నవ్వుతూ.

''అది కాదు—నీకెవరు చెప్పారు?"

నిట్టూర్చి అంది: "మీనాన్నగారు కబురంపారు. నీకు మతిపోయి....కనకం....కనకం....అని కలవరించావట. అప్పుడు ఇంకేమేం బైటపెట్టావో ప్రబుద్ధుడివి? మందిస్తే పెదిమలు బిగిస్తావట. ఎవరైనా వొస్తే తిట్టి పంపుతావట! ఆడవాళ్ళు వొస్తే 'కనకం!' అని పిలుస్తావట! వాళ్ళు నవ్వుకుంటారట! నీలాగు హృదయ దౌర్బల్యం ఎక్కువ మోతాదులో వుంటే—జీవించటమే కష్టం! ఆ డాక్టర్ను....కొట్టావుటగా!"

ఇదంతా నాకు తెలీకుండానే జరిగిందా?

"నిన్ను కూడానా?"

"లేదులే—అప్పుడు వొచ్చినట్టయితే ఏం చేసే వాడివో కాని—"అర్ధోక్తిలో ఆగింది.

రెండు నిమిషాలు నిశ్శబ్దంతో గడిపాం.

"కనకం! ఈ పాటంతంతాకా ఇక్కడ వుంటావూ?"

''ఇది ఉదయం అనుకుంటున్నావా పిచ్చిలో పడిపోతున్నావ్....రాజా! నేను విన్నాను, కన్నాను కాని ఇంతగా మతిభ్రమించిన వాళ్ళను ఎక్కడా ఎరగను. పడుకో—రేపు చెప్తాలే....విసరనా....కళ్ళు మూసుకో...."

మధ్యమధ్య కళ్ళు తెరుస్తూనే వున్నా: ఆమె చేతి వేళ్ళతో వారిస్తూనే వుంది.

ఒక రాత్రివేళ లేచి చూస్తే నాకు దగ్గరగా నాన్నా పడుకొని వున్నాడు. బైట ఏమీ కన్పించనంత చీకటి దట్టంగా అల్లుకొని వుంది. సన్నగా లాంతరు మూలన వెలుగుతోంది. జరిగిందంతా ఒక కలలాగు వుంది.

## ౧౩

మేలుకొనివున్నా: కాని కళ్ళు మూసుకొని పడుకొని వున్నా. నాకు సమీపంలో మాటలు విన్పిస్తున్నాయ్. ఒక కంఠం బాగా పరిచయమైందే! నాన్నది.

''మందు తాగాడా?"

''అది వొచ్చి ఇస్తే తాగాడు—"

"నేను చెప్పలా—ఇది యీ రకం జబ్బని?"

"దీనికింక మందులేదా?"

''మనోవ్యాధికి మందేమిటి? నేను చెప్తాలెండి—ఉపాయం—"

నాన్న తట్టి లేపుతూంటే, కాస్సేపు నిద్ర నటించి లేచా.

డాక్టర్ పరీక్షించి నాన్నవైపు తిరిగి. "ఇవ్వాళ మందు మారుద్దాం—" అన్నాడు.

"ఆకలేస్తోంది—" అన్నా 'అదేదో త్వరగా తేల్చమ'న్నట్టు చూస్తూ.

"తొందరెందుకు? నన్ను మరి కొట్టకుండా వుంటావా?" అన్నాడు (నెంచి కళ్ళు

మనసులోంచి వస్తున్నా నవ్వు—నాన్నపైపు తన పెళ్లాం చూస్తున్నట్టు చూస్తూ.

"ఈ చేదు మందులు నేను తాగను.... తాగను....అన్నం పెట్టించండి...." అన్నా. ఈ స్థితిలోవున్న నామీద ఎవరికే కోపం వొచ్చినా చచ్చినట్టు దిగమింగుకుంటారని తెలుసు,

"రే—పు."

''పనికిరాదు—ఇప్పుడు నేనే లేచి వెళ్ళి తింటా—"

"చచ్చాం—మళ్ళీ పిలిపించండి" అని నాన్నతో నిష్క్రమించాడు.

ఉన్నట్టు వుండి ఈ స్థితికి దిగి బతికిన వాణ్ణే కాక, చచ్చినవాణ్ణి కాక త్రిశంకు స్వర్గంలో——మునగానాం, తేలానాంగా వేళ్లాడుతున్నానేమా అని ఆలోచిస్తున్నా.

అంతా మరిచిపోదామని కళ్ళు గట్టిగా మూసుకొన్నా, అన్నం వొద్దన్న డాక్టర్‌మీద రాళ్ళు రువ్వుదామనిపిస్తోంది, ఈజీవితం ఆనందమయమల్లా విషాదమయానికి ఒక్క కప్ప గంతులో ఎల్లా దాటిందా అని చూస్తున్నా.

కనకం వొచ్చి తట్టి లేపిందాకా—ఊహా ప్రపంచంలోనే ఉన్నా.

"రాజూ! ఎల్లా వుంది?''

''బతికినట్టే కాని....వాళ్ళతో చెప్పు.... అన్నం పెట్టొచ్చుని—"

''నేనేం డాక్టర్ను కాదుగా—!"

ఈ పరిస్థితుల్లోనూ, ఇలాంటి మరికొన్ని క్లిష్టపరిస్థితుల్లోనూ, ప్రాక్టీస్‌లేని డాక్టరైనా సరే—ఇచ్చే దొంగ సర్టిఫికెట్లు అమోఘమైన చిలకొలుగా పనిచేసేమాట జ్ఞాపకానికొచ్చింది.

"మందుతాగవూ?" అంది గొంతు తగ్గించి.

"ఎన్నాళ్లు? తాగీ, తాగీ.........నోరంతా పాడై పోయింది.........అన్నం తిని.... తాగుతా."

"మళ్ళీ ప్రాణంమీదికొస్తుంది—"

"ఈ కష్టాల్లో కాలుపెట్టడంకన్న అదే నయం. రసహీనమైన నా జీవితం ఇంక విషాద బాష్పాలకేగా మిగిలింది!"

నిట్టూర్చి అంది: ''చూడు రాజూ! చేపలకు తెలీదూ—సముద్రంలో నీళ్ల ఉప్పు కషాయాలని? నువ్వొక్కడివేనా మానవుడివి? ఆలోచించు—నీ స్థితి సన్నిపాతానికి దింపిందంటే ... ఈ మనుషుల కందరికీ నీబతుకు బైటపడ్డదంటే....సిగ్గెయ్యటంలా? ఇప్పుడు తెలుసుకుంటున్నా—మతిభ్రమలు నీ లాటి వాళ్ళమీద బాగా పనిచెయ్య గలవని. ఛీ.... ఏమిటో అనుకున్నా—మనకన్న కష్టాల్ని అనుభవించిన వాళ్ళున్నారు. వాళ్ళను చూసన్నా-వాళ్లకన్న ఒకవాసి మనమే అదృష్టవంతులమని సంతోషపడాలి; ఓర్చుకోవాలి; నేర్చుకోవాలి. మందు తాగవూ? సరే—నన్ను వెళ్ళి పొమ్మంటావా?"

కడుపు నిండేట్టుగా చివాట్లు పెట్టింది. సీరియస్‌గా లేచి నిలబడ్డది. ప్రణయ కోపమో, ప్రళయ కోపమో అర్థమవక—ఏమైనా ఆమె వెళ్ళిపోతుందేమోననే ఆతురతతో, "తే" అన్నా. తప్పని సరిగా మందు గుటకల్ని ఒప్పుకున్నా.

"పోయిన వాళ్ళను పట్టుక్కూర్చుంటామా? ఉన్నవాళ్ళతోనే కాలం గడపాలి. తెలుసుకో—మనం ఎవరికోసమూ ప్రత్యేకించి జీవించటం లేదు, ఇతరులెవరూ మన కోసం ప్రత్యేకింపబడలేదు! అనవసరంగా—అనుభవ రహితమైన లేని నిరాశను కొని తెచ్చి పెట్టుకొని—కొరివిపెట్టి తల గోక్కుంటున్నావ్—నిన్ను చూసి ఆ ముసలాయన చూడు—ఎల్లా వున్నాడో! అందరూ ఏమనుకుంటున్నారో తెలుసా? నామూలానే ఈ మతి భ్రమ అని అపోహపడుతున్నారు. డాక్టర్ అన్నాడట, 'ఇది స్త్రీని గూర్చిన మనోబాధ' అని. అందరూ నవ్వుతున్నారు. కత్తికట్టి నన్ను కారకురాలుగా వేలెట్టి చూపుతున్నారు. నీ స్థితినికూడా నువ్వు తెలుసుకోకపోతే ఎట్లా?....సరే.... ఇకనుంచన్నా సరిగ్గా వుండు....ఇంకా ఏడవ్వాల్సిన రోజులు ముందున్నై. లేచి తిరిగే శక్తి రానీ....నిన్ను గూర్చి విచారపడే వాళ్లల్లో నేనుకూడా ఒకతెను, నమ్మవా? పోనీ—నా కోసం ఇదంతా మరచిపో! వింటావా నా మాట?"

అందరూ నవ్వుతున్నారనే సరికి రోషమూ, కోపమూ వొచ్చింది. పోయిన అమ్మకన్న కనకం ఎక్కువా అనిపించింది. నా జీవితానికి ఆధారమై దాదాపు ఇరవై ఏళ్ళుగా నాకు తోడునీడైన తల్లికన్న—మూడువసంతాలనుంచీ స్నేహితురాలైన—కనకానికి ఇంత అధికమైన విలువను ఎందుకివ్వాలనిపించింది.

[వచ్చే సంచికలో మరొక రసమయఘట్టం]